వైరస్ బారిన పశువులు

- రెండు వారాల్లో 20 ఆవుల దాకా మృతి
- ఆందోళనలో పాడి రైతులు

సోమందేపల్లి: మండలంలో రెండు వారాల్లో పదుల సంఖ్యలో ఆవులు వింత వ్యాధితో మృతి చెందుతున్నాయి. దీంతో పాడి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దాదాపు 20 దాకా ఆవులు మృతి చెదడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రధానంగా చిన్న బాబయ్యపల్లి, కొలిమిపల్లి, వెలిదడకల, కూగట్టుమానుపల్లి, పత్తికుంటపల్లి, గ్రామాల్లో ఆవులు మృతిచెందాయి. మెడ భాగంలో గడ్డగా ఏర్పడి ఉన్న ఫళంగా కుప్పకూలి చనిపోతున్నాయి. మంగళవారం కొలిమిపల్లిలో రామాంజినప్పకు చెందిన మూడు ఆవులు మృతి చెందడంతో రూ.1 లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. గత నెల 29న చిన్న బాబయ్యపల్లిలో బాబయ్యకు చెందిన 2, గంగాద్రికు చెందిన 1 పాలు ఇచ్చే ఆవు చనిపోయాయి. 30న వెలిదడకలలో కుమ్మరి ఈశ్వరయ్య, తలారి మధు, రామాంజి, కూగటు మానుపల్లిలో జంగమప్పలకు చెందిన ఒక్కొక్క ఆవు మృతి చెందాయి. పది రోజుల క్రితం పత్తికుంటపల్లిలో సోముకు చెందిన ఆవు దూడ మృతి చెందింది.

అంటు వ్యాధుల వల్లే ...

అంటు వ్యాధులు ప్రబలడంతోనే ఆవులు మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పశు సంవర్ధకశాఖ డీ.డీ పెంచయ్య తెలిపారు. మంగళవారం గ్రామంలో పశువైద్యులు పర్యటించారు. చనిపోయిన ఆవులకు పోస్టుమార్టం నిర్వహించారు. బుధవారం నుంచి పశువులకు వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఏడీ శ్రీనివాస్‌రావు, వైద్యుడు బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.


మృతి చెందిన పశువులను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు

రెండు నెలలుగా వ్యాధులు



పశువులకు రెండు నెలలుగా వ్యాధులు ప్రబలుతున్నాయి. తల, కాళ్లపై గడ్డలు మెలచి ఆవులు చనిపోతున్నాయి. వైరస్ నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి.

– కె.సత్యనారాయణ, వెలిదడకల

రూ.లక్ష నష్టం వచ్చింది



తన మూడు ఆవులు మృతిచెందడంతో రూ.లక్ష నష్టం వచ్చింది. ఆవులు పోషించుకుంటూ వచ్చే పాలను అమ్ముతూ జీవనం సాగిస్తున్నాము. ఇంకా మూడు ఆవులు ఉన్నాయి. వైరస్ నియంత్రణ కాకపోతే అవి కూడా మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి.

– రామాంజినేయులు, కొలిమిపల్లి


వైరస్ లక్షణాలను చూపిస్తున్న రైతు

బాల్య వివాహాలతో అనర్థాలు

రొద్దం: ఆడపిల్ల భారం కాదు.. ఆణిముత్యం.. 18 సంవసత్సరాలు నిండిన తర్వాతే ఆడ బిడ్డలకు పెళ్లిళ్లు చేయాలని అధికారులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆర్డీటీ, జిల్లా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాల్య వివాహాలు, వాటి వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి, ఆర్డీటీ మడకశి రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ చాలా మంది తల్లిదండ్రులు బాలికలకు సరైన వయస్సు రాకమందే పెండ్లి చేసి తమ భారం తగ్గించుకోవాలని ఆలోచిస్తుంటారని తెలిపారు. చదువుకునే వయస్సులోనే వివాహ బంధం పేరుతో బంధం వేయరాదన్నారు. మైనార్టీ తిరకముందే పెళ్లి చేసి చిన్నారుల జీవితాలతో ఆడుకుంటున్నారని పేర్కొన్నారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేలా ఐసీడీఎస్ తో పాటు వివిధ శాఖల అధికారులు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. బాల్య వివాహాలు చేస్తే అనర్థాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. 2006 బాల్య వివాహాల నిరోధక చట్టాల ప్రకారం వివాహం చేసుకున్నా, నిర్వహించినా, సహకరించినా చట్టరీత్యా శిక్షార్హులు అవుతారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వైద్యాధికారిని భాగ్యలక్ష్మి, ఆర్డీటీ టీం లీడర్ అదినారాయణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనురాధ, మహిళా పోలీస్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.


బాల్య వివాహాలపై అవనగాహన కల్పిస్తున్న అధికారులు

వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం: మున్సిపల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని వ్యాపారుల సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషిచేయాలని మార్కెట్ వ్యాపారులు వార్డు కౌన్సిలర్లు కోరారు. మంగళవారం న్యూ మార్కెట్ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డితో పాటు వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్ రాఘవేంద్ర పరిశీలించారు. షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధికి వ్యాపారులు అనుసరించాల్సిన విధానాలను, కేటాయించిన గదులు, షెడ్లలోనే వ్యాపారులు చేయాలన్నారు. ఇకపై ఆరు బయట అమ్మకాలు చేయరాదని, ప్రజల రాకపోకలకు అడ్డుగా ఫుట్‌పాత్‌లపై అమ్మకాలు చేయడం ఏమిటని కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యాపారులు మార్కెట్ పరిసరాల్లో అపరిశుభ్రం లేకుండా ఉంచుకోవాలని సూచించారు. అయితే మార్కెట్‌లో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల అపరిశుభ్రంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని వ్యాపారులు వాపోయారు. మున్సిపాల్టీ ద్వారా మార్కెట్ సెక్యూరిటీ, స్వీపర్లు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. తరుచూ అధికారులు, ప్రజాప్రతినిధులు మార్కెట్‌ను సందర్శిస్తూ ప్రజలు, వ్యాపారులకు అవసరమైన సదుపాయలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మకాయల రాము, మార్కెట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.


ఆరు బయట కాయగూరలు అమ్మరాదని చెబుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

హిందూపురం టౌన్: విద్యాహక్కును కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 4న చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఇందిరాపార్కులో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తోందన్నారు. నీట్ పరీక్షను రాసి నష్టపోయిన విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, తరుణ్, జశ్వంత్, పవన్, రాజా, హుస్సేన్, అశోక్, నిహాల్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్, చరణ్, నందకిశోర్ రెడ్డి, మునాక్, నితిన్, భానుప్రసాద్ పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఉన్నత చదువుతోనే బంగారు భవిష్యత్తు

రొళ్ల: ప్రాథమిక విద్య దశ నుంచి క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి బంగారు భవిషత్తును పొందాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండల పరిధిలోని దొమ్మరహట్టి, బాజయ్యపాళ్యం ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ఇంటి పనులకు పిల్లలను పరిమితం చేయకుండా చక్కగా చదువుకొనే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజూ మెను ప్రకారం రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఏజెన్సీల నిర్వాహకులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎండీఎం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


దొమ్మరహట్టి ప్రాథమిక పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ శ్రీధర్

'చదువు.. బరువు'పై విచారణ

హిందూపురం టౌన్: విద్యార్థుల చేత నోటు పుస్తకాలు మోయించిన ఘటనపై 'సాక్షి' దినపత్రికలో 'చదువు.. బరువు' శీర్షిక మంగళవారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై డీఈఓ మీనాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విచారణ చేపట్టాలని ఎంఈఓ గంగప్పను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎంఈఓ గంగప్ప పట్టణంలోని న్యూహస్నాబాద్ పురపాలక ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. విద్యార్థులతో నోటు పుస్తకాలు మోయించడంపై హెచ్ఎం బాలనారాయణస్వామిని వివరణ కోరారు. పట్టణానికి చెందిన 'చేయూత' సంస్థ విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేసిందని, ఆ సమయంలో పాఠశాల వద్ద బియ్యం లారీ అడ్డంగా ఉండడంతో ఆటో పాఠశాల లోపలికి రాలేదన్నారు. ఆయా పుస్తకాలు తీసుకెళ్తుండగా కొందరూ విద్యార్థులు ఉత్సాహంగా వెళ్లి పుస్తకాలు తీసుకు వచ్చారని, తాము విద్యార్థులకు సూచించలేదని వివరణ ఇచ్చారు. హెచ్ఎం ఇచ్చిన వివరణను లిఖితపూర్వకంగా తీసుకుని నివేదికను డీఈఓకు పంపినట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..


న్యూహస్నాబాద్ పురపాలక ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ గంగప్ప

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

హిందూపురం టౌన్: హిందువులపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో మంగళవారం సాయంత్రం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్ దేవేంద్రలు మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల్లో కాంగ్రెస్ కూటమి నాయకుడు రాహుల్ గాంధీ హిందువులపై చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలన్నారు. లేనిపక్షంలో ఎక్కడికక్కడ హిందూ సమాజం రాహుల్‌ని అడ్డుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంజన్‌రెడ్డి, సునీల్, శ్రీనివాసులు, మూర్తి, సురేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ జిల్లా నాయకులు, తిరుపతి ఇన్‌చార్జ్ పీడీ పార్థసారథి ఖండించారు.


రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

పావగడలో దొంగతనం

పావగడ: పట్టణంలోని కువెంపు నగర్‌లో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. స్థానిక పోలీసులు అందించిన సమాచారం మేరకు .. కువెంపు నగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు హులిరాజు తన కుటుంబంతో కలసి తమ సమీప బంధువుల వివాహానికి చెళ్లకెర వెళ్లారు. అదే అదునుగా భావించిన దుండగులు సోమవారం రాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని కేజీ వెండి ఆభరణాలు, రూ.30 వేల నగదు అపహరించుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితుడు హులిరాజు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురునాథ్ తెలిపారు. ఇదిలా ఉండగా... పట్టణ పరిధిలో ఇటీవల దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ప్రతి వార్డులోనూ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దొంగతనాలు జరుగుతుండటంతో స్థానిక పోలీసులు గస్తీ పెంచాలని కోరుతున్నారు.

దేశ ప్రగతికి రెవెన్యూశాఖ కీలకం

పావగడ: దేశ ప్రగతికి రెవెన్యూశాఖ కీలకమని , ఆ శాఖ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని స్థానిక తహసీల్దార్ వరదరాజు హితవు పలికారు. స్థానిక తాలూకా కార్యాలయంలో మంగళవారం రెవెన్యూశాఖ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు అందాల్సిన వివిధ ప్రభుత్వ పథకాలు త్వరితగతిన అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. వేడుకల్లో రెవెన్యూ అధికారులు, గ్రేడ్‌– 2 తహసీల్దార్ ఎస్ మూర్తి, ఉప తహసీల్దార్ వీణ, కసబ ఆర్ఐ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూశాఖ దినోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు

వైభవంగా కొల్లాపురమ్మ జాతర


జ్యోతులు మోస్తున్న మహిళా భక్తులు

పావగడ: పట్టణంలో ఉన్న శాంతినగర్‌లో గ్రామ శక్తి దేవతలు కొల్లాపురమ్మ, సొప్పులమ్మదేవి జాతరోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామశక్తి దేవతలకు మూగ జీవాలు బలి ఇచ్చారు. అమ్మవార్ల ఊరేగింపులో మహిళలు జ్యోతులు మోశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ శంకరరెడ్డి, కౌన్సిలర్లు రాజేశ్, టెంకాయల రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన


విద్యార్థులకు విద్యా సామగ్రి అందించిన దృశ్యం

పావగడ: విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని తేజస్ చారిటబుల్, ఎడ్యుకేషన్ ట్రస్ట్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సోమ్లానాయక్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. బీఈఓ ఇంద్రాణమ్మ మాట్లాడుతూ మెరుగైన విద్య కోసం తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులు, నోటు పుస్తకాలు అందజేశారు. ట్రస్ట్ కార్యదర్శి గాయత్రి బాయి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన చట్టాలపై అవగాహన


డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జనార్దన్‌నాయుడు

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం ఆవరణలో మంగళవారం ఎస్ఐ జనార్దన్‌నాయుడు ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల డ్రైవర్లకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీసాయి విద్యానికేతన్, సరస్వతి విద్యామందిరం, శ్రీదేవి, వాసవి, జేకే ప్రైవేట్ పాఠశాలల బస్సుల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు తదితర వాటిని తనిఖీ చేశారు. అదేవిధంగా గ్రామాల నుంచి విద్యార్థులను ఏ విధంగా బస్సులో ఎక్కించాలి.. ఎంత వేగంతో రావాలి తదితర రోడ్డు నియమ నిబంధనలను వివరించారు. అలాగే భారత ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన చట్టాలను వారికి వివరించారు. మండలంలోని కే.శివరం గ్రామంలో ప్రజలకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10.30 గంటలకు సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంత రాజు, ఎంపీపీ కవితతో పాటు అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. మండలస్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలన్నారు.

సీజినల్ వ్యాధులపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం వైద్య సిబ్బంది సీజినల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది డయేరియా, మలేరియా, టైఫాయిడ్, చికున్ గన్యా తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కలించారు. ఆయా వ్యాధుల నివారణకు తీసుకోల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుచిత్ర, విజయ్‌కుమార్, శాంతి, ఆశావర్కర్లు, ప్రధానోపాధ్యాయుడు దామోదరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా దీప్తి స్కూల్ వార్షికోత్సవం


దీప్తి స్కూల్ ప్రిన్సిపాల్ అబ్రహాం కుట్టి అంకుల్‌కు అభివాదం చేస్తున్న స్కూల్ లీడర్

హిందూపురం: పట్టణంలోని మేళాపురంలో ఉన్న దీప్తి స్కూల్ 41 వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కౌన్సిలర్ అంజప్ప, జనసేన నాయకులు ఆకుల రమేష్, దీప్తి స్కూల్ పూర్వ విద్యార్థులు ఆయిషా, భార్గవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అబ్రహాం కుట్టి అంకుల్ మాట్లాడుతూ గతంలో చిన్న సంస్థగా ప్రారంభమై దీప్తి స్కూల్ నేడు ఎంతో అభివృద్ధి చెంది పట్టణంలో అతిపెద్ద పాఠశాలలో ఒక్కటిగా నిలవడానికి పట్టణ ప్రజలే కారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దీపు అబ్రహాం, స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ లూసి, హెచ్ఎం షాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల తనిఖీ


వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఎస్‌డీటీ వాణిబాయి

రొళ్ల: మండల పరిధిలోని రొళ్ల, గుడ్డగుర్కి, బాజయ్యపాళ్యం తదితర గ్రామాల్లో వినియోగదారులకు రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాలను మంగళవారం పుట్టపర్తి డీఎస్ఓ కార్యాలయంలో పని చేస్తున్న సీఎస్‌డీటీ వాణిబాయి తనిఖీ చేశారు. ఆమె మట్లాడుతూ వినియోగదారులకు తూకాల్లో తేడా లేకుండా సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ఎండీయూ ఆపరేటర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉమేష్‌మంజునాథ్, ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు లేపాక్షిలో 'ప్రజావేదిక'

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు మహాత్మా గాంధీ గ్రామీణా ఉపాధి హామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకూ జరిగిన పనులను సామాజిక బృందం సభ్యులు తనిఖీ చేశారని, తుది నివేదిక సమర్పించడం జరుగుతుందన్నారు. అదే విధంగా పింఛన్లకు సంబంధించి జనవరి 2024 నుంచి జూన్ 2024 వరకూ లబ్ధిదారుల వివరాలు కూడా సామాజిక తనిఖీ సభ్యులు ఆడిట్ చేశారన్నారు. ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

మహాలక్ష్మీదేవికి పూజలు



రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో ఘనంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలు, గాజులతో పాటు వడిబియ్యం అమ్మవారికి కట్టి పూలతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. గ్రామస్తులతో కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

వైద్య వృత్తి పవిత్రమైనది


పరిగిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

పరిగి: సమాజంలో వైద్యులను దేవుడితో కొలుస్తారని వక్తలు తెలిపారు. మంగళవారం డాక్టర్స్ డేను పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్లు నవీన, స్వరూపరెడ్డి, సురేష్‌కుమార్, రూబీ నేతృత్వంలో ఆస్పత్రి సిబ్బంది, వైద్యారోగ్యశాఖ అధికారులంతా కలిసి డాక్టర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లను పంచిపెట్టారు.

అతిసార వ్యాధిని నియంత్రించాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

పరిగి: డయేరియా వ్యాధితో ప్రాణాపాయం సంభవించే ప్రమాదమూ లేకపోలేదని, ముఖ్యంగా పిల్లల్లో అతిసారా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు తెలిపారు. డయేరియా వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలు, నివారణోపాయాలపై స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ప్రాకారోత్సవం

కదిరి టౌన్: శ్రీఖాద్రీ నృసింహాలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుని వెండిరథం ప్రాకారోత్సవం నిర్వహించారు.వెండి రథంపై కొలువుదీరిన స్వామివారికి సుగంధ పుష్పాలతో, కదిరి మల్లెలు, తులసీ మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తరించారు.